
**పొద్దున తొమ్మిదిన్నరకు బడి మొదలైతే.. రెండు క్లాసుల తరువాత ఇంటర్వెల్ ఉండేది. దాన్ని ‘ఒంటేలు బెల్లు’ అనేవారు చాలామంది. బయటికి వెళ్లడం కోసం చిటికెన వేలు చూపించి అనుమతి అడిగితే ఒక దానికీ.. రెండు వేళ్లు చూపితే మరొకందుకూ, బొటన వేలు మడిచి నాలుగు వేళ్లు చూపితే దప్పికకూ అనీ కొండ గుర్తులుండేవి.**

# దూప!



మొదటి దానికి ఒక వేలు కాబట్టి.. ‘ఒంటేలు బెల్లు’ అనడం సబబుగా ఉండేదని అనుకునేవారేమో! ఈ ఇంటర్వెల్ కాకుండా.. బోర్ కొట్టే క్లాస్‌లోనూ; హోమ్‌వర్క్ చేయనప్పుడూ; దిద్దిన పరీక్ష పేపర్లు ఇస్తూ సార్ తిడతాడన్నప్పుడూ.. ఆపద్ధర్మంగా ఈ మూడు గుర్తుల్లో ఏదో ఒకటి వాడేవారు స్టూడెంట్స్. సార్లు కూడా ఎంతో ముందుచూపుతో కర్ఫ్యూ విధించినప్పుడు పోలీసుల్లా.. ‘ముగ్గురికి మించి ఒకచోట ఉండరాదు. గుంపులుగా కూడరాదు’ అన్నట్లు ఒకరికి మించి పంపేవారు కాదు. ‘మానవుడు సంఘ జీవి’ కాబట్టి.. ఆ ఒక్కరూ బయటికెళ్లి కూడా, మాట్లాడేందుకు ఎవరూ లేక తొందరగా వచ్చేసేవారు.

మాకు అత్యంత బోర్ కొట్టే ఓ క్లాస్‌లో.. ఎప్పుడు ఆ జైలు నుంచి బయటపడదామా? అన్నట్లే ఉండేవారు. ముందు ఒక పిల్లగాడు లేచి, వేలు చూపగానే.. ‘‘చల్! నకరాలు జెయ్యకు. కూసో!’’ అనేవాడు సార్. కొంచెం సేపు కాగానే మళ్లీ అతనే లేచి రెండు వేళ్లు చూపేవాడు. ‘‘ఏందిరా! నిన్న గ్యారెలు, బొబ్బుడాలు తిన్నవా ఏంది?!’’ అనేవాడు తప్ప.. అనుమతించేవాడు కాదు. మరి కాసేపటికి అతనే.. మళ్లీ మెలికలు తిరిగిపోతూ లేచేవాడు. సార్‌కు ఇక తప్పక.. ‘‘ఇగ పో! సావు పో!’’ అని అతణ్ని పంపించగానే.. కాసేపటికే ఇంకొక పిల్లగాడు లేచేవాడు. ‘‘ఏందిరా? నిన్న నువ్వు సుత శంకర్ గానింటికే బోయినానికి పొయినవా?!’’ అనేవాడు సారు. అతను సిగ్గుపడి పోయేవాడు. అలా ఒకరి వెనక మరొకరు పాఠం సాగనీయకుండా చేసేవారు.

అప్పట్లో తాగునీటి కష్టాలు మరీ ఘోరంగా ఉండేవి. ఇక ఎండకాలం అయితే.. పిల్లలు మాటిమాటికీ మంచినీళ్ల కోసం అడిగేవారు. ‘‘ఏందిరా?’’ అనగానే.. నాలుగు వేళ్లు చూపించి ‘‘దూపయితాంది సార్!’’ అనేవారు. మాలాంటి లోకల్ పిల్లలం మధ్యాహ్నం ఇంటికెళ్లి తిని, నీళ్లు తాగి వచ్చేవాళ్లం. పొరుగూరి పిల్లలు మూత, గొళ్లెం ఉన్న సత్తు డబ్బాల్లో అన్నం తెచ్చుకునేవాళ్లు తప్ప.. నీళ్లు తెచ్చుకునేవాళ్లు కారు. ఇప్పటిలాగా మంచి మంచి టిఫిన్ బాక్సులూ, వాటర్ బాటిళ్లూ ఉండేవి కావు అప్పట్లో!

మా బడికి ఒక పక్కన రైల్వే ట్రాక్, ముందు రోడ్డూ, మరో పక్కనా, వెనుకా పొలాలుండేవి. మంచినీరు కావాలంటే పొలాల్లో కరంట్ మోటార్ పంపుల దగ్గరికి వెళ్లాల్సిందే! పంపులోంచి నీళ్లు వస్తుంటే అక్కడే తాగేది. దాంతో బట్టలన్నీ తడిసి పోయేవి. ఒక ఏడాది ఫిబ్రవరి ఆఖరివారంలో మంచినీళ్ల కోసం మా అక్క వాళ్ల క్లాస్ టీచర్ ఒక ఉపాయం ఆలోచించారు. తరువాత అన్ని క్లాసుల వాళ్లు అదే ఫాలో అయ్యారనుకోండి.

అదేమిటంటే.. క్లాసులో విద్యార్థులంతా తలా రెండు రూపాయలిస్తే ఒక పెద్ద మట్టి కుండ, మూత, ఒక పొడవాటి అల్యూమినియం గంటె, ఒక గ్లాసూ కొనుక్కురావడం. రోజుకిద్దరు చొప్పున వంతులవారీగా పంపు దగ్గరికి వెళ్లి.. కుండను కడిగి, నీళ్లు నింపుకొని వచ్చి క్లాస్ రూమ్‌లోనే ఓ మూలకు పెట్టడం! దీనివల్ల పిల్లలందరూ మాటిమాటికీ బయటికి వెళ్లే అవసరం, అవకాశం ఉండదని ఉపాధ్యాయ వర్గాల ఉపాయం అన్నమాట!

మొత్తానికి ఆ రోజు ఇంటికి రాగానే నేనూ, అక్కా ఇద్దరం చెరి రెండు రూపాయలిమ్మని నాన్నను అడిగాం. స్కూల్‌లో దేనికో అడిగి ఉంటారనుకుని కారణమేం అడగకుండానే.. ‘‘ఇవాళ పైసల్లేవు. రేపో ఎల్లుండో ఇస్తతియ్యుండి’’ అన్నాడు నాన్న. నాలుగు రోజులు గడిచేసరికి నా ఫ్రెండ్స్ రాధా, శ్యామలా, రుక్మిణీ డబ్బులిచ్చి.. నేను ఇవ్వకపోవడం నాకు ఇజ్జత్ సవాల్‌గా మారింది. అక్కకూ అంతే! ఇక ఆ రోజునుంచీ అప్పు ఎగ్గొట్టిన వాళ్ల ఇంటి చుట్టూ వడ్డీ వ్యాపారి తిరిగినట్టు.. నాన్న ఎటు వెళ్తే అటు తిరుగుతూ అడగడం మొదలుపెట్టాం.

‘‘ఇంతకు మీకు పైసలెందుకు? ఏం జేస్తరు?!’’ అనడిగాడు నాన్న. ‘‘దూప అయితది గద నానా! గందు కోసం!’’ అన్నాను నేను.

‘‘దూపనా?! అంటేంది?!’’.. నాన్నకు అర్థం కాలేదు. ‘‘మా క్లాస్‌మేట్లు శాన మందికి దూప ఐతుందంట నానా! గందుకోసం ఒక కుండను కొనాల్నని అడుగుతున్రు!’’ చెప్పాను నేను. మార్జాలం అంటే ఏమిటని అడిగితే.. బిడాలం అన్నట్లు! అనిపించింది నాన్నకు.

ఇంతలో అక్క.. ‘‘ఎహె! కరెక్ట్‌గ జెప్పు. దూప అంటే దప్పి గదా నానా! అందరికీ బాగ దప్పి అయితుందని నీళ్ల కోసం కుండలు కొందామని అందర్ని పైసలు తెమ్మన్నరు’’ అని వివరంగా చెప్పింది. ‘‘ఓ! గట్ల చెప్పరు మరి! రేపే మీ బళ్లె అన్ని క్లాసులకు కుండలు నేనే పంపుత తియ్యుండి. కుమ్మరోండ్లకు నేను ఒడ్లు కొలిచి కుండలు తెప్పిస్త! ఇగ అందర్ని పైసలేం అడుగుతరు? అందరి దగ్గర ఉండొద్దా?’’ అన్నాడు నాన్న తేలిగ్గా. ఆ మాట వినగానే.. మా ఇమేజ్ డామేజ్ అవకుండా భలే అయింది అని ఆనందపడ్డాం. అప్పుడప్పుడూ ఎవరికైనా అలా వడ్లు ఇచ్చి, కావాల్సిన వస్తువులు తెప్పించడం మా ఇంట్లో అలవాటే!

ఆ మర్నాడు ప్రేయర్ టైంకే ఎనిమిది కుండలు పంపాడు నాన్న. అదే విషయం హెడ్‌మాస్టర్ సార్ ప్రకటించి.. అంతకుముందు కూడా బడి కోసం నాన్న ఎన్నోసార్లు సహాయపడిన విషయం చెప్పాడు. మా గుడిసె తరగతి గదులకు కావాల్సిన దూలాలూ, వాసాలూ, కర్రలూ, తాటి కమ్మలూ కూడా నాన్నే ఇచ్చాడని మాకు అప్పటిదాకా తెలియదు!

ఇక క్లాస్‌లో రోజుకిద్దరు చొప్పున నీళ్లు తెచ్చే డ్యూటీలు రూల్ నెంబర్ల ప్రకారం వంతులవారీగా అలాట్ చేశారు. అప్పుడు మా హెడ్‌మాస్టర్ సార్ వచ్చి.. ‘‘ఆ అమ్మాయిలకు నీళ్ల డ్యూటీ ఎయ్యకండి. వాండ్ల నాన్నే కుండలు తెప్పిచ్చిండు’’ అని మా క్లాస్‌లో, అక్కా వాళ్ల క్లాస్‌లో కూడా సార్లకు చెప్పారు. అయినా ఆ కాస్త బయటి గాలి పీల్చుకునే అవకాశం వదులుకోవడం ఇష్టం లేకా.. అలా నలుగురితో కాకుండా ప్రత్యేకంగా ఉండడం నచ్చకా.. మేం మాత్రం ఎగురుకుంటూ నీళ్లకు వెళ్లేవాళ్లం.

కొన్నాళ్లకు మా స్కూల్‌లో నీళ్లకోసం బోర్ వేసి రిగ్గింగ్ పంపు ఏర్పాటు చేశారు. ఆడపిల్లలమైతే ముగ్గురం వెళ్లేవాళ్లం. కొట్టగా కొట్టగా ఎక్కడో పాతాళంలో ఉన్న నీళ్లు పైకి వచ్చి కుండ నిండే సరికి.. మా చేతులు ఎర్రగా కంది పోయేవి. ఇంట్లో ఆ విషయం అస్సలు చెప్పేవాళ్లం కాదు. అయితే.. మా స్కూల్ అటెండర్లు మహ్మద్ నబీ, అమీనా బీ ఇద్దరూ బోరింగ్‌కు నీళ్లుకొట్టి, అన్ని క్లాసుల్లోనూ పెట్టేవాళ్లు. చిన్న పిల్లల్ని బోరింగు పంపు కొట్టనిచ్చేవాళ్లు కాదు.

ఇప్పుడు మీటింగుల్లో, ఫంక్షన్లలో ఎవరైనా గ్లాసుల కొద్దీ, బాటిళ్ల కొద్దీ నీళ్లు వృథా చేస్తుంటే.. ఆ నాటి మా నీటి కష్టాలు గుర్తొచ్చి బాధేస్తుంది. ఇప్పుడు పల్లెటూళ్లలో ఎవరో ముసలివాళ్లు తప్ప.. దాదాపుగా ‘దూప’ అన్న మాటను వాడటం కూడా కనిపించడం లేదు. ■



**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**